# చిక్కుముడి • టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

"ఫస్ట్ సిప్ ఆఫ్ ది డ్రింక్ అండ్ లాస్ట్ పఫ్ ఆఫ్ ది సిగరెట్... బోత్ ఆర్ వెరీ టేస్ట్" అంటూ వుంటారు అనుభవజ్ఞులు.



మొట్టమొదటి రౌండులో షివాస్ రీగల్ అయితే అనుమానిస్తూ, అనుమానిస్తూనే కన్నెపిల్ల అందిస్తున్న తొలి ముద్దులా వుంటుంది. అయితే..

"నేను చాలా చిక్కుల్లో వున్నాన్రా!" అన్నాడు సురేష్ దీనంగా ఫోజు పెట్టి, మొదటి రౌండ్ అయినా పూర్తి కాకముందే... నా అనుభూతినంతా పాడు చేసేస్తూ!

"అంటే ప్రపంచంలో మరెవరికీ చిక్కులూ, చికాకులూ వుండవనా నీ ఉద్దేశ్యం?" విసుగ్గా అడిగాడు చైతన్య. రామాయణంలో పిడకల వేటలాంటి మాటలంటే వాడికీ చిరాకే మరి.

"కానీ నాకు వచ్చిన కష్టం చాలా విచిత్రమైనది!" అన్నాడు సురేష్ జాలి గలిగేలా దీనంగా చూస్తూ.

"సరే!... నమ్ముతున్నాము.. అసలు సంగతి ఏమిటో చెప్పి తగలబడు!" అన్నాను నేను సిగరెట్ వెలిగించుకుని.

చాలాకాలం తరువాత మా ఊరు వచ్చాడు వాడు. వాడు చెప్పేది విని వాడిని సంతృప్తి పరచడం మా ధర్మం నిజానికి.

"ఆమె చాలా అందమైనదిరా!". అన్నాడు వాడు ఉపోద్ఘాతంగా.

నేను అప్పుడే పీల్చిన సిగరెట్‌పొగ చాలా చాలా రుచికరంగా అనిపించింది. డ్రింక్ తీసుకుంటున్నప్పుడు ఎవరూ అబద్ధం చెప్పలేరు సామాన్యంగా.

"ఆమె నడక కూడా చాలా అద్భుతంగా వుంటుంది!"

"ఒరేయి బాబూ! ఆమె నవ్వు, నడకా, వడుం సన్నదనం మొదలైనవన్నీ ఏకరువు పెట్టడంకన్నా ఆమె ఎవరో తను అంత అందమైనదయితే నీకు వచ్చిన చిక్కేమిటో వివరంగా విడమర్చి చెప్పరా చాలు!" అన్నాడు చైతన్య.. చిరాకుగా మాత్రం కాదు.

"అదే...అదే.. ఎక్కడ్నుండీ మొదలు పెట్టాలా అనేదే అర్థం కావడం లేదు!" అన్నాడు సురేష్ పరాకుగా ఆలోచిస్తూ.

"ప్రతి కథా ఎక్కడో ఒక చోట మొదలవ్వాల్సిందే కాబట్టి ఎక్కడో ఒకచోట మొదలు పెట్టరా నాన్నా! " అన్నాను నేను ఆసక్తిగా.

వాడు వాడి గ్లాసులో మిగిలివున్న రెండు గుక్కలు ఒకేసారి బాటంసిప్‌గా లాగేసి గ్లాసు బల్లమీద వుంచి సిగరెట్ వెలిగించుకుని తన కుర్చీలో జారగిలబడి "ఇది కథకాదురా!" అంటూ ప్రారంభించాడు.

xxx

"వాళ్ళు నా ప్రక్క వాటాలో చేరినప్పుడు.. అంటే నేను ఆమెను చూసిన తొలి రోజులలో నాకు ఆమె మీద ఇంప్రెషన్ అంటూ పెద్దగా ఏదీ ఏర్పడ లేదు. అసలు ఆమె ఓ రూపవతిలా కూడా కనిపించలేదు నా కళ్ళకు.

తరువాత తరువాత....ఆమె ఏ పని చెప్పినా చవటాయిలా ఆమెభర్త చేసుకుపోతూంటే నాకు కాస్త ఆసక్తి కలిగి వాళ్ళను అబ్జర్వ్ చేయడం మొదలు పెట్టాను.

నేను కాస్త ఆలస్యంగా గ్రహించిన విషయాలలో మొదట్టమొదటిది. ఆమె చాలా అందమైనది! రెండవది.. ఆమె గొప్ప కమాండింగ్ నేచర్‌ను కలిగి వుంది!! మూడవది.. ఆమె భర్త ఆమె ఏం చెప్పినా.. చివరికి వరద గోదావరిలో దూకమన్నా "సరే!" అనడమే తప్ప కాదు అని చెప్పలేడు!!!

ఎందుకలా జరుగుతోందో నాకు ఎంత ఆలోచించినా అంతు పట్టేది కాదు.

ఆమె ఆఫీసర్‌లా ఆజ్ఞలు జారీ చేసేస్తుంటే అతడు ఓ బంట్రోతులా ఆమె చెప్పిన పనులన్నీ కిక్కురు మనకుండా చేసుకు పోతూండేవాఢు చకచకా.

"అతగాడేమయినా పురుషత్వం సంపూర్ణంగా లేని పురుషుడేమో?" అనే అనుమానం కూడా కలిగింది నాకు.. ఆమె అజమాయిషీ అతని పనీ చూస్తూంటే. కానీ నా ఆలోచన తప్పని గ్రహించడానికి ఎక్కువ రోజులు పట్ట లేదు.

చీకటి పడక మునుపే సన్నజాజుల పొట్లం, స్వీట్సు ప్యాకెట్ పట్టుకుని ఇల్లు చేరిపోయేవాడు అతడు. రాత్రి ఎనిమిది దాటక మునుపే వారి వాటా తాలూకు తలుపులన్నీ మూసుకుపోయేవి. ఒక్క రాత్రులంటే ఏమిటి? పగటి వేలల్లో కూడా తరచుగా వారి తలుపులన్నీ మూతలు పడుతూనేవుండేవి.

రసికత కేమాత్రం తక్కువ లేదు నిజానికి!

రాత్రులందు ఆమె తన భర్తచేత పాలు త్రాగించేదో, లేదో కానీ ఉదయాన్నే పాలపాత్ర మొదలుకొని ప్రతీదీ కడిగించేది అతని చేత. ఇల్లు చిమ్మించేది, తుడిపించేది, బట్టలు వుతికించేది.. ఇలాంటి ఆడంగి పనులన్నీ అతడు నిస్సంకోచంగా చేస్తూ కనిపించడం మాత్రం నాకు చాలా ఆశ్చర్యం కలిగించేది. ఆమె కత్తికి ఎదురు లేదు ఆ ఇంట్లో!

ఒకరికి పట్టు ఇరువురు పని మనుషులను పెట్టుకోగలిగిన స్థితిలో వున్నా ఆపని మాత్రం చేసేవారు కారు! వారి కథలా అలా అలా నడిచిపోతూనే వుండి వుంటే ఎంతో బావుండేది నిజానికి. కానీ....

పిడిరాయిలా తిరుగుతూ ఆమె చెప్పే ప్రతిపనీ చేసుకుపోతుండిన ఆ మహానుభావుడు ఓ రోజు ఉదయాన్నే హార్ట్ అటాక్‌తో పడిపోయాడు ఠపీమని. ఇరుగు పొరుగువాళ్ళం కలసి హాస్పటల్‌కు తీసుకుపోయాం వెంటనే.. కానీ జాలీ దయాలేని మృత్యువు గ్రద్దలా చిన్నవయసులోనే వున్న అతన్ని తన్నుకుపోయింది.

రావలసిన వాళ్ళందరూ త్వరగానే వచ్చి చేరారు.

ప్రాణం పోయిన తరువాత నిర్జీవ శరీరాన్ని పాతి వెయ్యడాన్కి లేదా తగులబెట్టడాన్కి ప్రాణమున్న మనుషులు పడేతొందర అంతా ఇంతా కాదు.

ఇంటా బయటా పనులుచేస్తూ మిలటరీ సిపాయిలా రెస్ట్‌లెస్‌గా తిరుగుతుండిన అతడి అంత్యక్రియులకు చకచకా ఏర్పాట్లు జరిగిపోతున్నాయి.

అదేం ఆచారమో తెలియదు కానీ




పాడెమీదుంచిన శవం పక్కగా ఆమెనూ కూర్చో బెట్టి ఆమె నెత్తిమీద కూడా బిందెలతో నీళ్ళుకుమ్మరిస్తూ వుంటే గుండె లవిసేలా రోదిస్తున్న ఆమెకేసి కోపంగా చూస్తూ "ఇంకెవరికి ఆర్డర్లు జారీ చేసి అడ్డమైన చాకిరీలూ చేయించుకుంటావు?" అని అనుకున్నాను మనసులోనే!

కానీ అదంతా చాలా కొద్ది క్షణాలే... తడిసి పోతున్న దుస్తులలోంచీ తన్నుకొచ్చినట్లు కన్పిస్తున్న ఆమె ఒంపు సొంపులను, నిగారింపులను, చర్మ సౌందర్యపు మెరుపును... అలాంటి సమయంలో కూడా అలా కళ్ళు విప్పార్చుకుని చూస్తూ వుండిపోయాను.

శవం కూడా ఆమె ప్రక్కనే వున్నా "స్త్రీల కుచాలూ, నాభీ చూసి మోహావేశాలకు లోనవకు.. అది కేవలం మాంసం క్రొవ్వుల రూపాంతరం అనే విషయం పదే పదే నీ మనసులో మననం చేసుకో!" అనే అర్థాన్ని చెప్పే ద్వాదశ మంజరికలోని శ్లోకం నాకా సమయంలో జ్ఞాపకానికి రాలేదు.

xxx

భర్తపోయిన తరువాత కొద్ది రోజులలోనే ఏ బాదరబందీలేని తన పెద్ద తల్లిని తనకు తోడుగా తెచ్చుకుని అదే వాటాలోనే వుండిపోయింది ఆమె.

తన భర్త ఇన్సూరెన్సు పెద్ద మొత్తమే చేశాడు. అతని తాలూకు భూములన్నీ కూడా అమ్మివేసి వచ్చిన డబ్బంతా మొత్తం కలిపి బ్యాంకులో వేసుకుని వడ్డీ మాత్రం డ్రా చేసుకుంటూ హాయిగా, దర్జాగా కూర్చుంది ఆమె.

మూడు నెలల పాటు వీధి ముఖం చూడలేదు. కనీసం ప్రక్క వాటాలోని నాక్కూడా కన్పించలేదు ఆమె. తరువాత తరువాత పెరట్లో, బావి దగ్గరా, కూరగాయలు, ఆకుకూరలు, పాలు మొదలైనవి తీసుకుంటున్నప్పుడూ కన్పిస్తూ వచ్చింది అడపాదడపా.

మీకు తెలుసు.. నేనేం ఆడదాని మొహం చూడని వాడ్ని కాను. పైగా తన భర్త బ్రతికివున్నప్పుడు అతడ్ని ఆమె పనివాడికన్నా హీనంగా చూసిందన్న కోపమూ ఆమె మీద నాకు లేకపో

లేదు. అయినా ఎందుకో ఆమెను చూస్తే చాలు కళ్ళు మరల్చుకోలేక పోసాగాను క్రమక్రమంగా.

తోడూ, నీడా లేని వంటరి ఆడ దాన్ని దాదావు ప్రతి మగవాడూ అలాగే చూస్తాడేమో నాకు తెలియదు... కానీ.. ఆమెను చూడకుండా ఒక్క రోజు గడవడం కూడా దుర్భరం అయి పోసాగింది నాకు.

ఆమె చాలా అందమైనది... కానీ ఆ అందం అంతా ప్రత్యేకంగా గమనించే వారికే తెలుస్తుంది. రోజులు గడిచే కొద్దీ ఆమె ఇంకా ఆకర్షణీయంగా కన్పించసాగింది నాకు.

చిట్టచివరికి ఒక నిశ్చయానికి వచ్చే శాను.. ఎలాగయినా సరే కనీసం ఒక్క పర్యాయం... ఒకే ఒక్క పర్యాయం అయినా ఆమెతో ఆ అనుభూతిని, సౌఖ్యాన్ని పంచుకుని తీరాలి అని! ఆ ఆలోచనకు వచ్చేసిన మరు నిముషం నుండీ నే నా ప్రయత్నాలు నేను మొదలు పెట్టాను.

నిజం చెప్పున్నానురా, దాదావు ఆరు నెలలపాటు చాలా శ్రమప డ్డాను. రోజుకు రెండు పర్యా యాలు షేవ్ చేసుకోవడం, రెండు సార్లు స్నానం చెయ్యడం, రకరకాల దుస్తులు కుట్టించుకుని మార్చి మార్చి తొడుక్కోవడం... అందంగా, ఆకర్షణీయంగా ఆమె కళ్ళలో పడ డానికి నిరంతర తపనతో ఎక్సయిట్ అవుతూ గడపడం ... ఏ ట్వంటీ ఇయర్స్ ఎంగ్‌స్టర్ కూడా తన స్వీట్ సిక్షీన్ కోసం అంతగా తపనపడి ప్రయత్నాలు చేసివుండడు. ముప్ప యికి చేరువవుతున్న నేను పాతిక దాటిన ఆమె కోసం చిన్న కుర్రా డిలా ఎన్నో ప్రయత్నాలు చేశాను, ఎంతగానో ప్రాకులాడాను, తల్లడిల్లి పోయాను, తపస్సు చేశాను!!

నా నిరంతర కృషి ఒక కొలిక్కి వచ్చింది చివరికి.

ఒక సుప్రభాత సమయానికి కాస్త ముందు... పెరట్లోని నైట్‌క్వీన్ చెట్టు క్రింది క్రీనీడలలో సువాస నల మధ్యన ఆమెను ఓ పర్యాయం కౌగలించుకుని ముద్దుపెట్టుకోవడా నికి అవకాశం లభించింది.

నేనా మధురానుభూతిలో మునిగి పోతోండగా...

"తప్పకదా?" అంది ఆమె అర మోడ్పు కన్నులతో ఆలవోకగా చూస్తూ.

"తప్పేముంది? ఇట్స్ ఎ బయలాజికల్ నీడ్! మగతోడు లేకుండా నీవున్నావు. స్త్రీ నీడ లేకుండా నేనున్నాను. ఇద్దరం ఆకలిగా వున్నాం. దాన్ని తీర్చుకో వడంలో తప్పేముంది?" అన్నాను.

నా కా క్షణాలలో సమాజం, కట్టు బాట్లు, ధర్మాధర్మ విచక్షణ మొదలై నవేవీ లీలగా అయినా జ్ఞాపకానికి రాలేదు.

అప్పటికే వేడెక్కిన ఆమె ఒళ్ళు ఎక్కుపెట్టిన విల్లులా బిర్రబిగుసు కుంటోంది నా చేతుల మధ్యన. ఆ శరీరాన్ని ఆసాంతం స్వంతం చేసు కుని, అందులో లీనం అయిపోతే తప్ప నాకు కళ్ళుకూడా సరిగ్గా కన్పిం చవేమో? అన్నంత మత్తుకు, వ్యామో హానికీ లోనయిపోతున్నాను.

ఇంతలో ఆమె వాటాలోంచి, ఏదో చిన్న అలికిడి విన్పించింది.

"ఇప్పుడు కాదు!" అంది ఆమె నా కౌగిలిని విదిలించుకుని దూరంగా జరుగుతూ.

"ఎప్పుడు? ఎక్కడ??" తపనగా తహతహలాడిపోతూ, తల్లడిల్లిపోతూ ప్రశ్నించాను.

"అనుకూలమయిన అవకాశం రానీ!" అంది ఆమె నెలవంకలా నవ్వి... అక్కడ్నుండీ వెళ్ళిపోతూ.

చంద్రుని రాక కోసం ఎదురు చూసే చకోరపక్షిలా ఆ అవకాశం కోసం మరో ఆరు నెలలు కాచు కుని ఎదురుచూశాను.

మహాశివరాత్రినాడు లభించింది మాకుకావాల్సినంత రహస్యమైన ఏకాంతం.

జాగరణ కోసం ఆమె పెద్ద తల్లి శివాలయానికి వెళ్ళిపోయింది. రాత్రి పదకొండు గంటలు గడ చిపోయాక తెరచివుంచబడ్డ పెరటి గుమ్మంగుండా ఆమె ఇంట్లోకి ప్రవే శించాను నేను చీకటిమాటున.



దుస్తుల మధ్యన ఆమె అందాన్ని చూడడం వేరు. బెడ్‌లైట్ వెలుగులో నగ్నంగా ఆమె శరీరాన్ని దర్శించడం వేరు.


నిజంగా బ్రహ్మదేముడు కంప్యూ టరైజుడు మైక్రామీటరుతో కొలతలు పెట్టి తయారుచేసి వుండాలి ఆ శృంగార దేవత శరీరాన్ని. ఆడదానికి ఎక్కడెక్కడ ఏయే ఒంపుసొంపులు ఎలా వుండాలో కరెక్టుగా ఆమెలో అలాగే వున్నాయి.

ఎంత చూసినా తనివి తీరని వింత వెలుగులున్నాయి. మత్తుగా మెరిసే ఆమె కళ్ళలో, అమృతధారల రుచి వుంది ఆమె పెదవులలో. అరు ణారుణ కాంతులతో వెలిగే అసుర సంధ్య తాలూకు మెరుపు వుంది ఆమె మేని రంగులో. అగ్నిపర్వతా లలోని వేడివుంది ఆమె శరీరంలో పెను తుఫాను గాలి తాలూకు వాడి వుంది ఆమె బిగి కౌగిలిలో కలసిపోయిన ఆమె శరీరం మీద సొమ్మసిల్లిపోతూ మత్తుగా కనుమూ యడంలో హిమాలయాల చల్లదనం వుంది!

ఊపిరి పీల్చుకోవడానికి కూడా వ్యవధి లేనివాడిలా ఆమెతో కల సిపోయి అద్భుతమైన ఆమె బిగి కౌగిళిలో కరిగిపోయాను... ఆమెను ఊపిరి తీసుకోనివ్వకుండా! తూర్పు తెల్లబారిపోతున్నప్పుడు కానీ మేమీ లోకంలోకి రాలేకపోయాము.

మొట్టమొదట నేను అనుకున్నది

## వజ్రాల నగరం



జర్మనీలోని దక్షిణ భాగంలో వార్డింగెన్ అనే పట్టణం వుంది. కోటిన్నర సంవత్సరాల క్రితం ఒక తోకచుక్క నేలమీద ఢీ కొనడంతో ఏర్పడిన పెద్ద గొయ్యిలో ఈ పట్టణం నిర్మితమయ్యింది. మధ్య కాలంలో ఇక్కడ పట్టణం నిర్మించిన పురపిత్రులకు ఈ విషయం తెలియదు. ఈ మధ్యనే సైంటిస్టులు అక్కడికి వెళ్ళి కొలతచేసి చూస్తే ఆ తోకచుక్క సైజుకు సరిగ్గానే ఆనాటి వాళ్ళు వృత్తాకారంలో గోడను నిర్మించినట్టు తెలి సింది. తోకచుక్కలు నేలమీద ఢీకొన్నప్పుడు ఆ ఘర్షణకు నేలలో వున్న రాయి కరిగి ఆవిరై అక్కడ వజ్రపురాళ్ళు సృష్టించబడాలి. సైంటి స్టులు దాన్ని కూడా పరీక్షించారు. ఈ పట్టణంలో నిర్మించబడిన ఒక చర్చి గోడకు ఉపయోగించిన రాళ్ళలో వజ్రపు కణాలున్నాయని ప్రకటించారు. తమకు తెలియకుండా పూర్వం మనుషులు వజ్రఖచితమైన దేవాలయాన్నే నిర్మించేశారు.

— మంజూష.

ఆమెతో ఒక్క పర్యాయం గడపగలిగితే చాలని ... ఆమె అంగీకరించింది కూడా ఒక్క అవకాశం మాత్రం ఇవ్వడానికే!

కానీ కథ అంతటితోనే ఆగిపోలేదు... పునరావృత్తం అయింది.

మొట్టమొదట మూడవ కంటికి తెలియకుండా చాలా కాన్ఫిడెన్షియల్‌గా సాగింది వ్యవహారం. ఆపై ఆమె తన పెద్దమ్మను ఎలా మేనేజ్ చేసుకుందో తెలియదు కానీ ప్రతి రాత్రి పెరటి దారిన నా వాటాలోకి రాసాగింది. "నా శృంగార దేవత నా చేతుల మధ్య ఉండడం కన్నా స్వర్గమేముంది నాకు!" అంటూ ఆపాడు సురేష్.

ఉత్సాహంగా మరో రౌండ్ స్కాచ్ గ్లాసులలోకి వంచుతూ అన్నాను "ఇంత లక్కీ ఛాన్స్ కొట్టినవాడివి... చిక్కులూ, చికాకులూ అంటూ ఏడుపు మొహంతో మొదలుపెట్టావేమిట్రా?"

"చిక్కుకాక మరేమిట్రా... ఇప్పడామె తనను పెళ్ళి చేసుకోమంటోంది!" అన్నాడు వాడు దిగులుగా.

"ఇంకా ఈ ఏడుపేమిట్రా? శరీరాలు, మనసులు కలసిపోయిన తరువాత ... వితంతువనే సంకోచం ఎందుకు? ఖచ్చితంగా ఆవిడను నీవు పెళ్ళి చేసుకోవాల్సిందే!" అన్నాడు చైతన్య ఎంకరేజ్ చేస్తూ.

నేను గ్లాసులలోకి బిసలరీస్ వంచుతూ నెమ్మదిగా అన్నాను "నిన్ను అడ్డగించేంతటి దగ్గరి వాళ్ళెవరూ నీకు లేరు. పైగా నీవూ ఆమెను చూడకమునుపు అస్ఖలిత బ్రహ్మచారివేం కాదు! కాబట్టి ఆమెను వెంటనే పెళ్ళి చేసేసుకోవడం ఉత్తమం, ధర్మం!!"

సురేష్ తన గ్లాసు అందుకుని ఓ గుక్క త్రాగి అన్నాడు... "మీకు నా సమస్య ఏమిటో సరిగ్గా అర్థం కాలేదురా! ఆమెను పెళ్ళి చేసుకుంటే చచ్చిపోయిన ఆమె భర్త ఏయే పనులుచేస్తూ బ్రతికేవాడో అవన్నీ తప్పక చేస్తూ బ్రతకాల్సిందే నేనూ చవటాయిలా. ఆమె ఇప్పటికే నీ మీద అజమాయిషీ చెయ్యడమూ, ఆర్డర్లు జారీ చెయ్యడమూ నేను పనివాడిలా వాటిని ఆచరించడమూ కూడా మొదలయిపోయాయి.

"అధికారం చలాయించడంలో తను పొందగలిగే సాడిస్టిక్ ఆనందం మరెందులోనూ పొందదు ఆమె. పనివాళ్ళను పెట్టుకోవడానికి ఒప్పుకోదు. ఇతరుల ముందు నన్ను కించపరుస్తూ మాట్లాడడంలో కూడా ఆమె పొందే ఆనందం అంతా ఇంతా కాదు.

"ఆమె చెప్పిన మాట ఏ ఒక్కటి వినకపోయినా ఆపై రెండు మూడు రోజులపాటు దరిచేరనివ్వదు. పైగా అయిష్టంగా ఆమె ఉన్నప్పుడు బలవంతంగా పొందేది సుఖం కానే కాదు. ఆమెకు దూరంగా వుండలేక చివరకు ఆమె చెప్పినట్లే విని వంట చెయ్యడం, బట్టలుతకడం కూడా నేర్చుకున్నాను... ఇప్పుడు కొత్తగా పెళ్ళి చేసుకుంటే తప్ప దరి చేరనివ్వనని భీష్మించుకు కూర్చుంది!" అంటూ నిట్టూర్చాడు గాఢంగా.

సురేష్ చెప్పింది నాకు సగం అర్థం అయింది, సగం అర్థం కాలేదు. "అలాంటప్పుడు ఆమెను పెళ్ళి చేసుకోవద్దు! ఆ ఊర్నుండీ ట్రాన్స్‌ఫర్ చేయించుకో!" అన్నాను కోపంగా.

నేనలా అనగానే వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"సదా ఛరిస్ రంగు ఛరీఫ్రూట్ రుచులలో వుండే ఆమె పెదవుల తాలూకు అధరామృతాన్ని గ్రోలకుండా జీవించలేనురా నేను!" అన్నాడు వాడు చాలా దిగులుగా, దీనంగా!"

అప్పుడు అర్థమైంది నాకు పూర్తిగా! ... ఆమె భర్త ఎందుకు బానిసలా బ్రతికేవాడో కూడా తెలిసిపోయింది.

ఆమె తప్పకుండా మధువనిలో రాధిక లాంటి స్త్రీ అయి వుంటుంది. పైగా పురుషుడికి స్వర్గధామాన్ని చూపుతూ ఎలా పాదాక్రాంతుణ్ణి చేసుకోవచ్చో గ్రహించిన స్త్రీ ఆమె. సాడిజం అనే ఒక్క అవలక్షణం ఆమెలో లేకపోయివుంటే నిజంగా దేవతలాంటి స్త్రీ అయివుండేది ఆమె.

ఆమెను వివాహం చేసుకోవడం అంటే సురేష్ బలిపశువుగా మారడం అన్నమాటే!! కానీ ఆమె మీద ఏర్పడ్డ వ్యామోహాన్నీ ఓ పట్టాన వదిలించుకోలేడు జీవితంలో!

వాడు చెప్పినట్లు ఇది విచిత్రమైన చిక్కు ముడి. వాడు ఆమెను ప్రేమించగలడు, లోకానికి వెరువకుండా ఆమెతో శారీరక సంబంధ బాంధవ్యాలు కూడా కలిగి వుండగలడు.. ఆమె పొందు లేకుండా జీవించనూ లేడు... అయితే.. ఆమెతో వైవాహిక బంధాన్ని మాత్రం ఏర్పరచుకోలేడు.

అదే అన్నాడు వాడు కూడా దిగులుగా... "ఐ లవ్ హర్... బట్... ఐ కెనాట్ లివ్ విత్ హర్!"

నేను తల వంచుకుని ఆలోచనల్లో పడ్డాను.

అందుకే అన్నాడేమో మౌన్‌కేన్ మహాశయుడు "లవ్ ఈజ్ లైక్ వార్! వెరీ ఈజీ టు స్టార్ట్ బట్ మోస్ట్ డిఫికల్టు టు స్టాప్!!" అని.

సాలెగూడులాంటి ఈ సమస్య మధ్య నుండీ సురేష్‌ను వెలుపలికి లాగడం ఎలా?

ఇతలో మరోసారి భారంగా నిట్టూర్చాడు సురేష్.

"మీరే ఏదయినా సలహా ఇచ్చి నన్ను ఆదుకోవాలిరా!" అన్నాడు.

నా బొంద! నేనేం సలహా ఇవ్వగలను? ఏదయినా సలహా ఇవ్వగలిగితే చైతన్యగాడే ఇవ్వాలి. వాడే బాగా తెలివైనవాడు మా బ్యాచ్‌లో!"

అలా అనుకుంటూ నేను తలపైకెత్తి చైతన్య కేసి చూశాను.

వాడు కనిపించలేదు! వాడి కుర్చీ కూడా ఖాళీగా వుంది!! వాడు సగమే త్రాగిన విస్కీ గ్లాసు కూడా టేబిలు మీదే వుంది!

ఏదో అనుమానం తోచి లేచి హాల్లోంచి వెలుపలికి వచ్చాను. చైతన్య జాడ లేదు.

గబగబా వీథి గేటు వద్దకు వెళ్ళి చూశాను.

చైతన్య కన్పించాడు... దూరంగా వీథి చివర్న... మోటర్ బైక్ మీద మలుపు తిరుగుతూ!

00


ఆటోమేటిక్ టాయ్ రివాల్వర్



MARSHAL ZORO
Rs. 175/-
పోస్టల్ ఛార్జీలు అదనం

50 షాట్లు ఉచితం

BULLET ZORO
Rs. 270/-
పోస్టల్ ఛార్జీలు అదనం

★ లైసెన్స్ అవసరం లేదు
★ పిల్లలకు అపూర్వమైన బహుమతి
★ మహిళలకు ఆత్మ రక్షణ కొరకు

మార్షల్ జోరో మరియు బుల్లెట్ జోరో తుపాకులు మీకు పూర్తి రక్షణ నిస్తాయి. పిక్‌నిక్‌ల కొరకు, డ్రామాలలో, షూటింగ్‌లకు ప్రయాణాలలో మరియు జంతుల బారినుండి రక్షించుకొనుటకు పొగలు విరజిమ్ముతూ ప్రేలే తుపాకి వెంటనే మీ ఆర్డరులను పంపించండి.

PRAGATHI TRADERS (A/3)
(P0) MAIRA BARITH(GAYA)